



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

కరెంట్ కోత.. ఉక్కపోత

వేళాపాళా లేకుండా కరెంటు కోతలు
వేసవి వేళ ఉక్కపోత..దోమల మోత
అల్లాడిపోతున్న పిల్లలు, వృద్ధులు
ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలు





ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 9గంటలు దాటిందంటే సూర్యుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. ఇంటి నుంచి బయటకు రావడానికే ప్రజలు జంకే పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇళ్లలో ఫ్యాన, లేదా కూలర్ కింద కూర్చోని కాస్త సేద తీరుదామంటే కరెంట్ ఉండటం లేదు. విద్యుత్ శాఖ అధికారులు అప్రకటిత కోతలతో జనం అల్లాడిపోతున్నారు. వేళాపాళలేని కోతలతో ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో కోతలు పెడుతుండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వేడి, ఉక్కపోతతో ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నా వాటి నివారణకు చర్యలు తీసుకోవడంలో క్షేత్రస్థాయి అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఏదైనా సందర్భంలో కరెంటు సమాచారం తెలుసుకునేందుకు విద్యుత్ శాఖ కార్యాలయాలకు ఫోన్ చేస్తే..ఫోన్లు ఎత్తి సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో సంబంధిత అధికారులు, సిబ్బంది ఉన్నారన్న వాదనలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. మెయింటనెన్స్ డే పేరుతో వారానికొకసారి ఐదారు గంటలు కోత విధిస్తూనే అనధికారికంగా కూడా విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు.

పల్లెల్లో వేళాపాళా లేకుండా కోతలు

గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటోంది. వేళాపాళా లేకుండా విద్యుత సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నట్లు పల్లె ప్రజలు వాపోతున్నారు. ఒకసారి కరెంట్ పోతే మళ్లీ ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి. రాత్రి, పగలు అన్న తేడాలు లేకుండా కోతలు అమలవుతున్నాయి. పగటి వేళల్లో కరెంటు పోతే చెట్ల కింద..పొలాల్లో సమయం గడిపేస్తున్నారు. రాత్రి వేళల్లో కరెంటు తీసేస్తుండటంతో వారి పరిస్థితి దయనీయంగా తయారైంది.

కోతలు లేకుండా సరఫరా చేయాలి



పగలు, రాత్రి అన్న లేడా లేకుండా కరెంటు పోతోంది. కరెంటు పోతే ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. ఉక్కపోత, వేడితో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. చిన్న పిల్లలు మరింత ఇబ్బంది పడుతున్నారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కోతలు లేకుండా కరెంటు సరఫరా చేయాలి.

- రేణుక, డిబిఎన్.పల్లె, గృహిణి, రాజంపేట.

ఇబ్బంది పడుతున్న పిల్లలు, వృద్ధులు



ఉక్క పోతలతో ఉక్కిరిబిక్కిరి అవుతుంటే కరెంటు కోతలు తీవ్రంగా వేధిస్తున్నాయి. మనస్ఫూర్తిగా భోజనం కూడా చేయ లేకున్నాం. చిన్న పిల్లలు, వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ప్రజల ఇబ్బందులు గుర్తించి కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి.

- గురుప్రసాద్, భువనగిరిపల్లె, రాజంపేట.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

భువనగిరిపల్లెలో వెలసిన శ్రీలక్ష్మీన రసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించి విద్యుత్ ఏర్పాట్లలో భా గంగా సర ఫరా నిలిపి వేస్తు న్నారు. ఒక్క చోట ఎల్‌సి తీసుకుని ఇత ర గ్రా మాలకు విద్యుత్తు సరఫరా చేయాలి. అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బందిపడుతున్నాం.

- హరికృష్ణ, డిబిఎన్.పల్లె, రాజంపేట.

అసౌకర్యం కలగకుండా చర్యలు

భువనగిరిపల్లె లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించి విద్యుత్ సరఫరా చేసేందుకు కొన్ని గ్రామాల్లో కోతలు విధించాల్సి వచ్చింది. భువనగిరిపల్లె వద్ద ఎల్‌సి తీసి మిగిలిన గ్రామాలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు కృషి చేస్తాం.

- ఈశ్వర్‌రాజు, రూరల్ ఎఇ, విద్యుత్ శాఖ, రాజంపేట.

వారంలోగా భూసేకరణ పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

వచ్చే వారంలోగా కల్లా ఎత్తిపోతల (లిఫ్ట్ స్కీం) పథకానికి సంబంధించి భూ సేకరణ ప్రక్రియ పూర్తి కావాలని సంబంధితాధికారులను కలెక్టర్ గిరీష ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎత్తిపోతల పథకం, ముదివేడు బ్యాలెన్స్ రిజర్వాయర్, తదితర ప్రాజెక్టుల భూసేకరణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.ఆగస్టులో కురిసే వర్షాలకు శ్రీనివాస్ రిజర్వాయర్ నీటితో నింపుదామని, ఆలోగా పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. శ్రీనివాస్ రిజర్వాయర్ పెండింగ్ బిల్లులు ఏమైనా ఉన్నాయా వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఝరికోన ప్రాజెక్ట్ సంబంధించి భూ సేకరణలో భాగంగా శెట్టిపల్లి, దేవపట్ల గ్రామాలలో ల్యాండ్ అక్వేషన్స్ పూర్తి కావాలని ఆర్‌డిఒను ఆదేశించారు. అన్ని ఎత్తిపోతల పథకాలకు సంబంధించి వచ్చేవారంలోగా ఫైనల్ ఆర్అండ్ఆర్ పూర్తి కావాలన్నారు. లక్కిరెడ్డిపల్లి లిఫ్ట్ స్కీమ్ సంబంధించి ఫారం సి, ఆర్అండ్ఆర్ పూర్తి చేయాలన్నారు. ఈ నెల ఆఖరిలోగా రెవెన్యూ పరంగా భూసేకరణ పనులన్నీ పూర్తి చేసి అప్లోడ్ చేయాలన్నారు. ముదివీడు బ్యాలెన్స్ రిజర్వాయర్ సంబంధించి కురబలకోటలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ త్వరగా పూర్తిచేయాలని పేర్కొన్నారు. జిఎన్ఎస్ఎస్ నుంచి హెచ్ఎన్ఎస్ఎస్ ల్యాండ్ అక్వేషన్స్ ఎన్ని గ్రామాలు చేశారు, ఇంకా ఎంత పెండింగ్ ఉంది అడిగి తెలుసుకున్నారు. రాబోవు వర్షాకాలంలో పింఛ ప్రాజెక్టులో నీటిని నిల్వ ఉంచేందుకు రిటర్నింగ్ వాల్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. 15 రోజులకు ఒకసారి ప్రాజెక్టులో పనులు పురోగతిపై తెలియజేయాలన్నారు. అన్నమయ్య డ్యామ్ సంబంధించిన ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సమీక్షలో డిఆర్‌ఒ సత్యనారాయణ, రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవి కిరణ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ జయరాజ్, ఇరిగేషన్ అధికారులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

పరిహారం త్వరగా పంపిణీ చేయాలి

జాతీయ రహదారులు ఎన్‌హెచ్ 71 మదనపల్లి నుంచి పీలేరు, ఎన్‌హెచ్ 716 కడప నుంచి రేణిగుంట మార్గంలో రాజంపేట డివిజన్ పరిధిలో ఇప్పటికే సేకరించిన భూములకు వేగంగా పరిహారం పంపిణీ చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారులకు సేకరించిన భూములకు సంబంధించి లబ్ధిదారులకు పరిహారం చెల్లింపు అంశంపై తహశీల్దార్లు, ఎన్‌హెచ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్‌హెచ్ 71 కింద మదనపల్లి నుంచి పీలేరు వరకు వాయల్పాడు, కలికిరి, మదనపల్లి, పీలేరు నాలుగు మండలాల్లో సేకరించిన భూములకు సంబంధించి పరిహారం చెల్లింపు ఇంకా కొంత పెండింగ్ ఉందని, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్‌హెచ్ 716 కింద కడప నుంచి రేణిగుంట మార్గంలో రాజంపేట డివిజన్‌కు సంబంధించి 72 కిమీల మేర నిర్మిస్తున్న జాతీయ రహదారిలో నందలూరు, రాజంపేట, ఓబుల వారిపల్లి పుల్లంపేట, రైల్వేకోడూరు 5 మండలాల్లోని 24 గ్రామాల పరిధిలో ఇప్పటికే సేకరించిన భూములకు సంబంధించి పరిహారం చెల్లింపు అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. లబ్ధిదారులకు త్వరితగతిన పరిహారం చెల్లించేందుకు తహశీల్దార్లు కృషి చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియలన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పరిహారం చెల్లింపు అంశంలో ఎప్పటికప్పుడూ తగు పర్యవేక్షణ చేయాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో డిఆర్‌ఒ సత్యనారాయణ, ఎన్‌హెచ్ అధికారులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.


నగరవనాన్ని తనిఖీ చేస్తున్న బి.కె.సింగ్

నగరవనాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మాదినికొండ వద్ద అభివృద్ధి చేస్తున్న నగరవనాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని అడిషనల్ పిసిసిఎఫ్ బికె.సింగ్ అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం మాదినికొండ రిజర్వులో అభివృద్ధి చేస్తున్న నగరవనాన్ని సిసిఎఫ్ నాగేశ్వరరావుతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు నగరవరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నగరవనాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వివిధ అంశాలలో సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. వారి పరిధిలో అటవీ ప్రాంత సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై కూడా తగు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఫారెస్ట్ అధికారి వివేక్, పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ డిఎఫ్ఒ ఆశాకిరణ్, రైల్వేకోడూరు సబ్ డిఎఫ్ఒ అనురాగ్ మీన, మదనపల్లె రేంజ్ ఆఫీసర్ మదన్ మోహన్‌రెడ్డి, డిఆర్ఒలు మదన్ మోహన్, మధుసూదన్, ఎఫ్‌బిఒ ప్రకాష్ హాజరయ్యారు.

నేడు పెన్షనర్ల సంఘం సమావేశం

ప్రజాశక్తి-పీలేరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అత్యవసర సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వగళ్ల చంద్రారెడ్డి, ఎర్రమరాజు తెలిపారు. పెన్షనర్లకు ఇకెవైసి తప్పనిసరని, ఆ ప్రక్రియను ఈ నెల 11వ తేదీలోగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. అలా చేసుకోకపోతే పెన్షన్ పొందడం సాధ్యం కాదని తెలియజేశారు. స్థానిక తిరుపతి రోడ్డులోని ఎస్‌టిఒ కార్యాలయంలో ఇకెవైసి చేసుకునే సౌకర్యాన్ని ఎస్‌టిఒ ఏర్పాటు చేశారన్నారు. పింఛనుదారులకు ఇకెవైసి ఆవశ్యకత గురించి తెలియజేయడం కోసం ఈ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. పింఛనుదారులు సమావేశానికి హాజరయ్యే ముందు ఆధార్ కార్డు నెంబరు, సిఎఫ్ఎంఎస్ నెలవారి పెన్షన్ ఐడి నెంబరు, సెల్ ఫోన్ తీసుకురావాలని తెలియజేశారు.

విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని బిసి సేన ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మదనపల్లి మున్సిపల్ కమిషనర్‌ను గురువారం కలిసి అనువైన స్థలం మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబులరెడ్డిపల్లి నాగరాజ, జిలగల రాఘవేంద్ర యాదవ్ మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశాజ్యోతి, బహుజనుల ఆరాధ్య దైవం మహాత్మ జ్యోతిరావు పూలే అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన మహాత్ముడిగా, సమాజ కట్టుబాట్లను ఎదిరించి అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన పూలే దంపతులని పేర్కొన్నారు. బహుజన మహిళల కోసం, వారి అభివృద్ధి కోసం తన ప్రాణాల సైతం లెక్కచేయక జీవితాంతం బహుజన మహిళల కోసం పోరాడిన సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేయడం కోసం మదనపల్లి పట్టణంలో అనువైన స్థలాన్ని మంజూరు చేయవలసిందిగా విజ్ఞప్తి చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నవోదయ మల్లికార్జున, ఎస్వీ రమణ, ప్రభాకర్, రాజేష్, మహేష్, మనీ, వాజిద్, వెంకటేష్, రవి, భరత్ తదితరులు బిసి సేన ప్రతినిధులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బిసి నాయకులు

ఆరోగ్యవరం డైరెక్టర్‌గా రవీంద్ర బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణం సమీపంలోని చారిత్రాత్మక ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ నూతన డైరెక్టర్‌గా డాక్టర్ కె.పి.రవీంద్ర గురువారం రాయలసీమ డయాసిస్ బిషప్ డాక్టర్ ఐజాక్ వరప్రసాద్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బిషప్ వరప్రసాద్ మాట్లాడుతూ 110 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ ప్రపంచంలోనే ప్రసిద్ధిగాంచిందన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ఇక్కడ మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల కుటుంబ పాలన పర్యవేక్షణలో ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ ఒడిదొడుకులను ఎదుర్కొన్నదన్నారు. గత డైరెక్టర్ ఇష్టానురీతిలో వ్యవహరించడం వల్ల ఆరోగ్యం మెడికల్ సెంటరులో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. ఇక్కడ పరిస్థితులను చక్కదిద్దడానికి నూతన పాలకవర్గాన్ని గత ఏడాది డిసెంబర్‌లో రాయలసీమ డయాసిస్ పెద్దలు ఏర్పాటు చేశారని చెప్పారు. రవీంద్ర నియామకం రాయలసీమ డయాసిస్ నిబంధనకు లోబడి, చట్టబద్ధంగా జరిగిందన్నారు. ఇందులో రాజకీయాలు కానీ, వేరే ఉద్దేశ్యం ఏమీ లేదని స్పష్టం చేశారు. గత డైరెక్టర్ కార్యాలయానికి తాళం వేసి వెళ్లడంతో రెవెన్యూ, పోలీస్ శాఖ సమక్షంలో తలుపులు బద్దలు కొట్టిన అనంతరం రవీంద్ర డైరెక్టర్ కుర్చీలో ఆశీనులయ్యారు. అనంతరం నూతన డైరెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ డైరెక్టర్‌గా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. గతంలో జమ్మలమడుగులో క్యాంప్‌బెల్ ఆసుపత్రిలో 25 సంవత్సరాలపాటు కంటి వైద్యుడిగా సేవలందించి, లక్షలాది మందికి కంటి శస్త్రచికిత్సలు నిర్వహించానని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ అభివృద్ధికి నిస్వార్థమైన సేవలు అందిస్తానని స్పష్టం చేశారు. తనకు ఈ అవకాశం కల్పించిన వరప్రసాద్, రాయలసీమ డయాసిస్ పెద్దలకి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఆరోగ్యవరం నర్సింగ్ కళాశాల అడిషనల్ ఇన్‌ఛార్జిగా డాక్టర్ డాక్టర్ శామ్యూల్ స్వరూప్ కుమార్ బాధ్యతలు చేపట్టగా, నూతన ట్రెజరర్‌గా త్వరలోనే డాక్టర్ ధనరాజ్ బాధ్యతలు స్వీకరించనున్నారు. కార్యక్రమంలో రాయలసీమ డయాసిస్ ఆఫీసర్లు సి.సాల్మన్, యు.సాల్మన్, పి.ఎన్.వినయ్ కుమార్, ట్రెజరర్ మేరీ కుమార్, ఆరోగ్యం మెడికల్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.


ఆరోగ్యవరం డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ రవీంద్ర

4జి టవర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు : గిరీష


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో బిఎస్ఎన్ఎల్, ఎయిర్టెల్, జియో తదితర 4జి మొబైల్ టవర్స్ ఏర్పాటుకు సంబంధించి స్థలాల ప్రతిపాదనలు జూన్ 1లోగా ప్రభుత్వానికి పంపించాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జెసిలతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి వివిధ అంశాలలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రెవెన్యూ అంశాలలో భాగంగా జగనన్న భూహక్కు- భూరక్ష రీ సర్వే ప్రగతి, రాష్ట్రంలో చేపట్టిన జాతీయ రహదారులు, పర్యాటక ప్రాజెక్టులకు భూసేకరణ, గృహ నిర్మాణం, వ్యవసాయం, అనుబంధ రంగాలు, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి తదితరాలలో జిల్లాల వారీగా కలెక్టర్లతో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సమీక్షించి సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేయనున్న 4జి టవర్స్‌కు సంబంధించి కంబైన్డ్ సర్వే ఎంత పూర్తి చేశారు, ఎన్ని టవర్స్ ప్రతిపాదించారు, ఎన్ని సైట్లు స్వాధీనం చేశారు, ఇంకనూ మిగిలినవి ఎన్ని, ఆర్ఒఎఫ్ఆర్ సమస్యలు తదితరాలలో అధికారులను వివరాలను అడిగి తెలుసుకుని తగు సూచనలు జారీ చేశారు. అన్నమయ్య జిల్లాకు సంబంధించి రెండు పర్యాటక ప్రాజెక్టులకు అలియనేషన్ ప్రతిపాదనలు, ఒక ప్రాజెక్టుకు అడ్వాన్స్ పొజిషన్ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని వీటిని సంబంధించి క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి సమర్పించాలని టూరిజం అధికారిని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో గృహ నిర్మాణ లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. జగనన్న లేఔట్ కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. జగనన్న భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా రీసర్వే పూర్తి చేసిన గ్రామాలలో నిర్దేశిత లక్ష్యం మేరకు హద్దురాళ్లను పాతించాలన్నారు. జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారులకు సంబంధించిన భూసేకరణ కూడా త్వరగా పూర్తిచేయాలన్నారు. ఆర్బికేల పరిధిలో డ్రోన్ పైలెట్ కోసం చదువుకున్న గ్రామీణ యువతను గుర్తించాలని వ్యవసాయ ఉద్యానవన శాఖల అధికారులను ఆదేశించారు. వైయస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా ప్రతి ఆర్బికె పరిధిలో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. వైఎస్ఆర్ చేయూత కింద పశువుల యూనిట్ల మంజూరు, జగనన్న పాల వెల్లువ కార్యక్రమాలను వేగవంతం చేయాలని, ఉపాధి హామీ పథకం, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలలో నిర్దేశిత లక్ష్యం మేరకు ప్రగతిని సాధించాలని కలెక్టర్ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్సో డిఆర్ఒ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆరు వికెట్ల తేడాతో కడప జట్టు విజయం

ప్రజాశక్తి - కడప

అండర్- 23 వన్డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం కడప వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప జట్టుకు చెందిన జహీర్ అబ్బాస్ అద్భుతంగా బ్యాటింగ్‌లో రాణించి సెంచరీ చేయడంతోనూ, బౌలింగ్ విజయ భాగేంద్ర రాణించడంతో కడప 6 వికెట్ల తేడాతో కర్నూలు జట్టుపై ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కర్నూలు జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది. ఆ జట్టులోని మహేంద్ర 51, సాయి సూర్య తేజ 48 పరుగులు చేశారు. కడప జట్టులోని విజయభావేంద్ర అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 255 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగుకు దిగిన కడప జట్టు 42 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 25 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆ జట్టులోని జహీర్ అబ్బాస్ 87 బంతులను ఎదుర్కొని ఏడు బౌండరీలు 6 బౌండరీ సిక్సుల సహాయంతో 110 పరుగులు చేసి జట్టు విజయానికి దోహదపడ్డారు. కర్నూలు జట్టులోని కనీష్ ఒక వికెట్ తీసుకున్నాడు.

7 వికెట్ల తేడాతో నెల్లూరు జట్టు..: కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై 7 వికెట్ల తేడాతో నెల్లూరు జట్టు ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్కు దిగిన అనంతపురం జట్టు 27.3 ఓవర్లలో 125 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ చెట్టులోని రెడ్డి 37 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని సాకేత్ రామ్ 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 126 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్కు దిగిన నెల్లూరు జట్టు 33.3 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 126 పరుగులు చేసి 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆ జట్టులోని నిఖిలేశ్వర్ రెడ్డి 52 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని మాధవ్ ఒక వికెట్ తీసుకున్నాడు.


తలపడుతున్న కడప, కర్నూలు జట్లు

ముగిసిన కేజీ సెట్

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల, కెఎల్ఎం మహిళ ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కెజీసెట్-2కె23 గురువారం విజయవంతంగా ముగిసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విఎస్ఎస్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ఈసారి రాయలసీమలోని వివిధ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్షా ఫలితాలను ఈనెల 30న విడుదల చేస్తామని పేర్కొన్నారు. అనంతరం కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుకు ఆల్ ద బెస్ట్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ కందుల మదన్ మోహన్ రెడ్డి, కరస్పాండెంట్, సెక్రటరీ కందుల రాజేశ్వరమ్మ, మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. వి. రత్నమ్మ, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి. ప్రేమ్ కుమార్, వివిధ విభాగాధిపతులు, కేజీ సెట్-2కె23 కన్వీనర్ టి. కిషోర్ కుమార్, అడ్మిషన్ కమిటీ డీన్ కె.రామ్మోహన్ రెడ్డి, సెట్ కార్య నిర్వాహక సిబ్బంది, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


ఎమ్మెల్యే నవాజ్‌బాషాను అభినందిస్తున్న అధ్యాపకులు

ఎమ్మెల్యేను కలిసిన బిటి కళాశాల అధ్యాపకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బిటి కళాశాలను యూనివర్సిటీ స్థాయికి మార్పు చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సహకారంతో కృషి చేసిన ఎమ్మెల్యే నవాజ్‌బాషాను కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కలిసి ధన్యవాదాలు తెలిపారు. కళాశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి సహకరిస్తామని ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. రాయలసీమలో ఎంతో ఘన చరిత్ర కలిగిన బిటి కళాశాలను యూనివర్సిటీగా చేస్తున్నందుకు సిఎం, ఎంపీ, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట శివారెడ్డి, పీడీ నారాయణ స్వామి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నారాయణ, రాజారెడ్డి, ప్రసాద్, సురేంద్ర, చలపతి, ఈశ్వరయ్య, కరీం పాల్గొన్నారు.

నేటి నుంచి సెమిస్టర్ పరీక్షలు

కడప అర్బన్: నగంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం(ఎఎఫ్‌యూ)లో ఈ నెల 5 నుంచి 16 వరకు 6వ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ విసి, పరీక్ష నియంత్రిక అధికారి ఆచార్య బి.అంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సురేంద్రనాథ్ రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లోని డిజిటల్ టెక్నిక్యూస్ ఇన్‌డిజైన్ అండ్ ప్లానింగ్, ఇంటీరియర్ డిజైన్, కాలేజ్ అఫ్ ఫైన్ ఆర్ట్స్‌లోని పెయింటింగ్, ఫొటోగ్రఫీ, అప్లైడ్ ఆర్ట్, యానిమేషన్ విభాగాలకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

షాదీ మహల్ స్థలం పరిశీలన

పీలేరు: పీలేరు పట్టణంలో షాదీ మహల్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారుల బృందం పరిశీలించింది. గురువారం అధికారులు షాదీ మహల్ స్థలాన్ని పరిశీలించి త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ శాఖ అధికారులు ముఖేష్, హసీనా, స్థానిక సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, మాజీ సర్పంచ్ హుమయూన్, వక్ఫ్‌బోర్డు జిల్లా సహాయ కార్యదర్శి గడి భాష, ఎఎంసి డైరెక్టర్ మునీర్, వార్డు సభ్యుడు హబీబ్, మైనారిటీ నాయ కులు మక్బూల్‌బాష, జిలానిసాహెబ్, పంచాయతీ ఇఒ వరప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న మైనార్టీ శాఖ అధికారులు



భోజనాన్ని వడ్డిస్తున్న నిర్వాహకులు

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక గాలివీడు పట్టణంలో ఏప్రిల్ 22 నుంచి ప్రారంభమైన పంచమ వేద మహాభారత యజ్ఞం గురువారంతో ముగిసింది. ఎన్.వాణిశ్రీ ఆధ్వర్యంలో భాగవతాన్ని స్థానిక లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలకు మాజీ ఎంపీ సాయిప్రతాప్ అల్లుడు సాయిలోకేష్ సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, బత్తుల్‌రెడ్డి, తపాలాయిస్టు, హార్మోనిస్టు కళాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

అనారోగ్యంతో బాధపడుతూ మాజీ సర్పంచ్ గురువారం మృతి చెందారు. రాచవేటివారిపల్లికు చెందిన మంచూరి సురేందర్‌రెడ్డి(60) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఉదయం మృతి చెందారని టిడిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్ అన్నారు. టిడిపి నాయకులు, మాజీ మండలాధ్యక్షులు చింతపర్తి రెడ్డప్పరెడ్డితో కలసి సురేందర్‌రెడ్డి భౌతిక కాయానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1988వ సంవత్సరం మండలాలు ఏర్పడిన తొలినాలలో చిన్న వయసులోనే సర్పంచుగా గెలుపొంది రాచవేటివారిపల్లి గ్రామ అభివృద్ధికి అనేక కార్యక్రమాలను చేపట్టి కృషి చేశారని అన్నారు. ఆయన సేవలను గ్రామ ప్రజలు చిరకాలం గుర్తించుకుంటారని తెలిపారు. ప్రజల ఆశీస్సులతో ఆయన ఆత్మకు శాంతి కలగాలని అన్నారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పింఛనుదారులకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని పింఛనుదారులు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని రాజంపేట పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పిల్లి పిచ్చయ్య అన్నారు. గురువారం నందలూరు పిహెచ్‌సిలో ఆయన మాట్లాడుతూ రాజంపేట ట్రెజరీ కార్యాలయంలో ప్రతి పెన్షనర్ దారుడు ఆధార్ కార్డు, దానితో లింక్ అయిన మొబైల్ ఫోన్‌ను తీసుకొని పెన్షన్ పొందే ట్రెజరీలో గానీ, కంప్యూటర్ సెంటర్ల వద్ద తప్పనిసరిగా ఇ-కెవైసి చేయించుకోవాలని అన్నారు.

కనుల పండువగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని చౌటపల్లి పంచాయతీ రవీంద్రనగర్‌లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి 29వ కల్యాణోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులు పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మి నరసింహ స్వామి కల్యాణోత్సవంలో పాల్గొని పూజల నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి వేళల్లో పురవీధులకుండా స్వామివారి ఊరేగింపు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చెక్కభజనలు, సాసవలచెన్నమ్మకథ వీక్షకులకు ఆకట్టుకుంది.

టంగుటూరులో సీతారాముల కల్యాణం..

నందలూరు : మండలంలోని టంగుటూరు గ్రామపంచాయతీ పరిధిలోని మదన మోహనపురం గ్రామంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో గురువారం రాత్రి అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు చుక్క వెంకటేశ్వరయ్య, చుక్క వెంకటయ్య, చింతకాయల వెంకటస్వామి, చుక్క చిన్నోడు, చుక్క రత్నయ్య, చింతకాయల వెంకటయ్యల ఆధ్వర్యంలో ఆలయంలో వేకువ జాము నుండి వేద పండితులు సీతారాముల విగ్రహాలకు ప్రత్యేకంగా అభిషేకాలు చేసి పూజలు నిర్వహించారు. యువ నాయకులు మేడా విజయశేఖర్‌రెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం వేద పండితుల వేద మంత్రాల నడుమ ఈ కళ్యాణ తంతు అత్యంత వైభవంగా జరిగింది. కల్యాణోత్సవానికి వచ్చిన వారికి మేడా విజయశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పఠాన్ అక్బర్‌ఖాన్, మాజీ సర్పంచ్ గంగి నాయుడు, చుక్క కొండయ్య, గుజ్జల ఈశ్వరయ్య, పోత్తపి చంద్ర, బీగాల సురేష్‌బాబు, మాజీ నీటి సంఘం అధ్యక్షులు అల్లా బకాష్, ఎపిఎంఆర్‌పిఎస్ మంగళపురి కొండయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నూతన ఎస్‌ఐ రవీంద్రబాబుకు సన్మానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట



ఎస్‌ఐని సన్మానిస్తున్న బాస్ నాయకులు

పిటిఎం మండలానికి బదిలీపై వచ్చిన ఎస్ఐ రవీంద్రబాబుని గురువారం బాస్ నాయకులు కలిసి దుశ్శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీంద్ర మాట్లాడుతూ న్యాయమైన సమస్యల కోసం ఎప్పుడైనా పోలీస్‌స్టేషన్‌కు రావచ్చుని చెప్పారు. చట్టానికి లోబడి ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బాస్ కేంద్రకమిటీ సభ్యులు కెవి.రమణ, బాస్ జిల్లా కమిటీ యస్.సింగన్న, బాస్ నియోజకవర్గం అధ్యక్షులు కె.రామచంద్ర, నాయకులు యం.గంగన్న, సి.కదిరప్ప, ఎస్.లక్ష్మీనారాయణ, కాట్నగల్లు రమణ, బాస్ మండల ఉపాధ్యక్షులు యస్.నరసింహులు, మబ్బు నరసిం హులు, ప్రచార కార్యదర్శి కే.నాగరాజు, బాస్ మండల కమిటీ సభ్యులు మొరుసుపల్లి రామాంజి, సదుంరాజు పిటిఎవం సర్పంచ్ తమక శంకర, మైనార్టీ నాయకులు అయూబ్‌బాషా పాల్గొన్నారు.

9 నుంచి ధార్మిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణం లోని రెడ్డివారివీధిలో గల చౌడేశ్వరి మాత ఆలయంలో దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 13 తేదీ వరకు ఐదు రోజులపాటు ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కడప జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ టి.గోపి బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణచే 9, 10, 11 తేదీలలో ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటల నుంచి రామాయణ, మహాభారత, భగవద్గీతలను గురించిన ఉపన్యాస కార్యక్రమాలు ఉంటాయన్నారు. 12న శుక్రవారం స్థానిక మహిళలచే అమ్మ వారికి కుంకుమార్చన, 13న ముగింపు కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

నేడు మంత్రి పెద్దిరెడ్డి రాక

బి.కొత్తకోట : పట్టణంలోని బత్తలాపురం రోడ్డులో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపం ప్రారంభానికి శుక్రవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిచ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా వస్తున్నారని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్‌అహ్మద్ పేర్కొన్నారు. కార్యక్రమానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, సింగల్ విండో అధ్యక్షులు, మార్కెట్ యాడ్ చైర్మన్లు, కమిటీ సభ్యులు, బి.కొత్తకోట నగర పంచాయతీ సచివాలయం కన్వీనర్లు సి.ఆర్.చిన్నికృష్ణ, గుమ్మ డికాయల చాంద్ బాషా, కంచి కళ్యాణ్ కుమార్‌రెడ్డి, ఎస్-ఎస్ ఫయాజ్, నక్క సంతోష్ తెలిపారు.

సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లె



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్ బాషా

అధికారులు, ప్రజాప్రతినిధులు మండల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే నవాజ్ బాషా అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపిపి డి.నరసింహులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. అధికారులు తమ శాఖల త్రైమాసిక ప్రగతిని నివేదికను సమావేశంలో చదివి వినిపించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వివిధ శాఖల ప్రగతిని సమీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నవరత్న హామీలలో భాగంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు దక్కేలా అధికారులు పనిచేయాలని సూచించారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులును ఆదేశించారు. ఎంపిపి నరసింహులు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ప్రజా ప్రతినిధులు భాగస్వాములు చేయాలని అధికారులు కోరారు. జగనన్న హౌసింగ్ లబ్ధిదారులకు బిల్లులు సమస్యలు లేకుండా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వెంగంవారిపల్లె పంచాయతీలోని నల్లంవారి పల్లెలో విద్యుత్ పోల్స్ సమస్యను పరిష్కరించాలని ఎఇని ఆదేశించారు. మండలంలో 4975 వివిధ రకాల పింఛన్లు అందజేస్తున్నట్లు ఎంపిడిఒ లీలామాధవి తెలిపారు. అమృత్ సరోవర్ పథకంలో భాగంగా రెడ్డివారిపల్లె, బండ్లపై గ్రామాలలో ఒక్కొక్క చెరువు రూ.5లక్షల రూపాయల కేంద్ర ప్రభుత్వ నిధులతో ఉపాధి హామీ పథకంలో భాగంగా అభివృద్ధి చేస్తున్నట్లు ఎపిఒ రమేష్ తెలిపారు. ఎపిఎం రజిని మాట్లాడుతూ మండలంలో 25 గ్రామ సమాఖ్యలు ఉండగా,7852 మంది డ్వాక్రా సభ్యులు ఉన్నారని అన్నారు. 591 డ్వాక్రా సంఘాలలోని 5112 సభ్యులకు మూడు విడతలుగా వైఎస్ఆర్ ఆసరా రూ.15.33కోట్ల రూపాయలు నిధులు ప్రభుత్వం వారి సంఘాల ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. మొబైల్ బుక్ కీపింగ్ స్థానంలో లోకోస్ యాప్ ద్వారా పీపుల్స్ ఆర్గనైజింగ్ సిస్టంలో డ్వాక్రా సంఘాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వైసిపి ఇన్‌ఛార్జి రమణారెడ్డి, వైఎస్ ఎంపిపి జయప్రకాశ్‌రెడ్డి, తహశీల్దార్ సిఆర్.మంజుల, ఎంపిడిఒ లీలామాధవి, ఎస్ఐ రామకృష్ణ, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం :'చింతల'

ప్రజాశక్తి-కంభంవారిపల్లి



సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలం లోని గర్నెమెట్ట పంచాయతీ పుష్పలో ఎమ్మెల్యే పర్యటించారు. ప్రతి ఇంటికి గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధి పత్రాలను వారికి చూపించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. రాష్ట్రంలోని పేదరికం తొలగిపోవడానికి మనమందరం తిరిగి జగనన్న ముఖ్యమంత్రిగా చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎపి ఎండిసి డైరెక్టర్ హరీష్‌రెడ్డి, మండల వైసిపి కన్వీనర్ వెంకటరమణారెడ్డి, మండల యూత్ లీడర్ గజ్జల సీన్‌రెడ్డి , జడ్‌పిటిసి శ్రుతిరెడ్డి, మాజీ జడ్‌పిటిసి జయ రామచంద్ర, హౌసింగ్ బోర్డ్ నెంబర్ కారపాకుల భాస్కర్ నాయుడు, సైపుల్లా ఖాన్, సర్పంచ్ రమణమ్మ, కమ్మవారిపల్లి సర్పంచ్, మండలం లోని కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ అధిక లోడు సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-నందలూరు



నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ అధికారులు

మండలంలోని నందలూరు, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని, నీలిపల్లెకు వెళ్లే రహదారి, నీలిపల్లె గ్రామాలకు నెలకొన్న విద్యుత్ అధిక లోడ్ సమస్యకు పరిష్కారం లభించినట్లు విద్యుత్ ఎఇ బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ఆ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అధిక లోడు కారణంగా, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యేవారని తెలిపారు. ఈ సమస్య పరిష్కారం కోసం ఆప్రాంతంలోని 100 కెవి ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించి, 160 కెవి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో లైన్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు, లైన్‌మేన్ శ్రీరామ్ కిరణ్ కుమార్, సచివాలయ జెఎల్‌ఎంలు వాసు, రవి, రాజా పాల్గొన్నారు.

మట్టి పాత్రల వినియోగం.. బహుళ ప్రయోజనం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



సగటు మనిషి జీవన కుటుంబానికి మట్టి పాత్రలు బహుళ ప్రయోజనాలు కలిగిస్తాయి. ప్రాచీన కాలం నుంచి నేటి నవీన యుగం వరకు మట్టి పాత్రల వినియోగానికే అధిక ప్రాధాన్యతనిచ్చారు. తినే తిండి నుంచి వాడే పాత్ర వరకు మట్టితో తయారు చేసిన పాత్రలోనే వినియోగించేవారు. నేటికీ వాటి ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. నేటికీ సమాజంలో పలు కార్యక్రమాలకు మట్టి పాత్రలను వినియోగిస్తున్నారు. కానీ కాల గమనంలో సిల్వర్ పాత్రలు మార్కెట్‌లోకి రావడంతో ఆదరణ తగ్గిందని చెప్పవచ్చు. వీటిపై ఆధారపడి జీవించే పలు శ్రామిక కుటుంబాలు బతుకుదెరువును కోల్పోయాయని చెప్పవచ్చు. ఈ మట్టి పాత్రలను పేదోడి ఫ్రిజ్‌గా పిలుస్తారు. వేసవి రావడంతో మట్టి పాత్రలు మార్కెట్లోకి వచ్చేశాయి. రెండు దశాబ్దాల క్రితం వరకు ప్రతి ఒక్కరూ మట్టి పాత్రలను వినియోగించేవారు. మట్టితో తయారైన పాత్రల ఉపయోగం ఎంతో మంచిదని చెబుతున్నారు. ఈ మట్టి పాత్రలో ఒక సామాజిక వర్గానికి చెందిన వారు ప్రత్యేకించి తయారు చేస్తారు. వీటిని అందంగా 10 కాలాల పాటు పదిలంగా ఉండేందుకు తయారు చేయడంలో ఎంతో పేరు ఉంది. బానలు, కుండలు, కడవలు ఇలా వివిధ రకాల పాత్రలు ఎంతో నైపుణ్యంతో తయారు చేస్తారు. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలు మట్టి పాత్ర తయారు చేయడంలో పేరుగాంచాయి. కానీ సాంకేతిక పరిజ్ఞానంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకోవడంతో మట్టి పాత్రల వినియోగం చాలా వరకు తగ్గింది. ప్రస్తుత కాల పరిస్థితుల్లో మార్కెట్లో వివిధ రకాల సామగ్రి అందుబాటులోకి రావడంతో మట్టిపాత్రలకు గిరాకీ తగ్గిందనే వాదన కూడా వినవస్తోంది. దీంతో వీటిపై ఆధారపడిన కుటుంబాలకు బతుకుదెరువు కరువైంది. విధిలేని పరిస్థితిలో తరతరాల నుంచి వస్తున్న కుల వృత్తికి స్వస్తిబలికి బతుకుతెరువు కోసం ఇతర మార్గాలను అన్వేషంచాల్సి వచ్చిందని శ్రామికులు చెబుతున్నారు. ప్రాచీన కాలం నుంచి మట్టి పాత్రలకు విశేష ఆదరణ ఉంది. ముఖ్యంగా వేసవిలో తాగునీటి కోసం మట్టిపాత్రలోనే వినియోగించేవారు. గతంలో బాటసారుల దాహార్తి కోసం గ్రామ శివారులో చెట్టుకు భానులను ఏర్పాటు చేస్తారు. మట్టిపాత్రలో నీటిని సేవించడం ఆరోగ్యానికి ఎంతో మంచిదని పలువురు చెబుతున్నారు. పూర్తిస్థాయిలో యాంత్రిక జీవనం సాగిస్తున్న సగటు మనిషి ప్రాచీన కాలం నాటి మట్టి పాత్రలను నేటికీ వినియోగిస్తూ ఆదరిస్తున్నారు.



మేడా, ఆకేపాటిని సన్మానిస్తున్న ఆలయ ధర్మకర్తలు

నరసింహస్వామి సన్నిధిలో మేడా, ఆకేపాటి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని భువనగిరిపల్లె శ్రీలక్ష్మీ నరసింహస్వామిని ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలు గురువారం దర్శించుకున్నారు. ఆలయ ధర్మ కర్తలు వారిని గజమాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి తమ సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఊటుకూరు ఎంపి టిసిలు నాగ చంద్రశేఖర్‌రెడ్డి, శీను, పృథ్వీ పతిరెడ్డి, సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసయ్య, ఎం.ఎల్ నారాయణ, హరి ప్రసాద్, వెంకటరమణ, కంభాయిగారి సుబ్బ నరసింహులు, కె.ఎస్ నరసింహ, నామాల రాజా, వైసిపి నాయకులు బొల్లినేని రామ్మోహన్ నాయుడు, హస్తవరం ఉమా మహేశ్వర్ రెడ్డి, అరిగెల సౌమిత్రి, దాసరి పెంచలయ్య, కరెంటు సుబ్బ రాయుడు పాల్గొన్నారు.

'ముక్కా' ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

ముక్కా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని గుంతకల్లు రైల్వే బోర్డు సభ్యులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం వైసిపి నాయకులు ముక్కా ఫౌండేషన్ అధ్యక్షులు ముక్కా రూపానందరెడ్డి జన్మదిన సందర్భంగా ఆయనను గజమాలతో సత్కరించి కేక్‌కట్ చేసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా ఎంతోమంది పేదలకు కంటికి సంబంధించిన శస్త్ర చికిత్సలను నిర్వహించి వారి జీవితం లో వెలుగులు నింపారని అన్నారు. నిరాశ్రయులైన పేదవారికి ఆర్థిక సాయం చేశారన్నారు. ఎంతో మంది అభాగ్యులు ఫౌండేషన్ ద్వారా సహాయం పొందారని అన్నారు. కార్యక్రమములో నాయ కులు బత్తిన వేణుగోపాల్ రెడ్డి, తల్లెం చంద్ర మోహన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ముక్కవారిపల్లి సర్పంచ్ శ్రీధర్, మొగిలి కాల్వా శంకర్‌రెడ్డి, నరేంద్రర్‌రెడ్డి, వాల్మీకి శ్రీనివాసులు, శివమని, శ్రీకాంత్ వెంకటేష్, రాముడు, శ్రీను, హరి చరణ్, యువరాజు, రమేష్ సాయి, పరశురామ్, గంగాధర్ పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం


ప్రజాశక్తి -బి.కొత్తకోట

లయన్స్ క్లబ్ మదనపల్లి, లయన్స్‌క్లబ్, హార్సిలీహిల్స్ ఆధ్వర్యంలో లయన్ కొండ నరేంద్ర, లయన్ డాక్టర్ విష్ణుప్రియల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని కొండా నరేంద్ర రెసిడెన్సీ, కళ్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మదనపల్లె లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్, డైరెక్టర్ లయన్ డాక్టర్ బోడి పాటి భాస్కర్‌నాయుడు, మదనపల్లె లయన్స్ క్లబ్ అధ్యక్షులు అప్పినపల్లి భాస్కరాచారి, హార్సిలీహిల్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ వాకా హరినాథ్‌రెడ్డి, ఎడిసిఎస్ లయన్ గౌతమ్ రెడ్డిలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ నివేదితచే కంటి పరీక్షలు నిర్వహించబడునన్నారు. కంటి అద్దాలు అవసరమైనవారికి లయన్ కొండా నరేంద్ర, డాక్టర్ విష్ణుప్రియల సౌజన్యంతో ఉచితంగా పంపిణీ చేస్తారని చెప్పారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ఈహెచ్‌ఎస్ పథకాల కింద లయన్స్ కంటి ఆస్పత్రి మదనపల్లి నందు ఉచితంగా చేయిస్తామన్నారు.ఆపరేషన్లు చేయించుకున్న వారికి ఉచిత భోజన సదుపాయంతోపాటు మందులు పంపిణీ చేయడం చేస్తామన్నారు. కంటి వైద్య శిబిరానికి హాజరయ్యేవారు ఆధార్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు, బ్యాంకు పాసు పుస్తకాలను తీసుకొని రావాలని సూచించారు.

మోడీ పాలనలో మీడియాకు స్వేచ్ఛ కరువు

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్రంలోని మోడీ పాలనలో మీడి యాకు స్వేచ్ఛ కరువైందని, దీంతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫ్రాన్స్‌కు చెందిన ఆర్ఎస్ఎఫ్ అనబడే అంత ర్జాతీయ మీడియా పర్యవేక్షక సంస్థ మీడియా స్వేచ్ఛపై 180 దేశాల్లో సర్వే నిర్వహించగా భారత్‌కు 161వ స్థానం వచ్చిందన్నారు. నార్వే, ఐర్లాండ్, డెన్మార్క్ దేశాలకు వరుసగా 1,2,3 స్థానాలు, పాకిస్తాన్‌కు 150, శ్రీలంకకు 135వ స్థానాలు వచ్చాయని తెలిపారు. చివరకు ఆఫ్ఘనిస్తాన్ కూడా 152వ స్థానంలో భారత్ కంటే ముందుందన్నారు. ఇప్పటికైనా ప్రజాస్వామ్యవాదులు మేల్కొనాలని తులసిరెడ్డి సూచించారు. పులివెందుల పట్టణం లో సిఎం జగన్ నివాసం ఉండే బాకరా పురం తోపాటు ఎర్రగుడిపల్లె, రోటరీపురంలో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులు ప్రారంభించి మూడేళ్ల గడుస్తున్నా పూర్తి కాకపోవడం దురదృష్టకరమని తులసిరెడ్డి విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 90 ప్రకారం హెడ్ వర్క్స్, కాలువలు, భూసేకరణ, నష్టపరిహారం, చెల్లింపులు, పునరావాస కేంద్రం బాధ్యత అన్నారు. కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వస్తేనే పోలవరం పూర్తవు తుందన్నారు.



ఎంపిపికి విరాళాన్ని అందిస్తున్న హేమంత్ కుమార్

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలోని తవళం గ్రామంలోని శ్రీయోగ నేలమల్లేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి కొండయ్యగారిపల్లి పంచాయతీ వెంకోజిగారిపల్లెకు చెందిన వైసిపి యువ నాయకులు బి.హేమంత్ కుమార్ రూ.25 వేలు ఎంపిపి నరసింహులు, మండల వైసిపి ఇన్‌ఛార్జి ఆర్ఐ.రమణారెడ్డిలను కలిసి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ నేలమల్లేశ్వర స్వామి ఆలయం ప్రస్తుతం శిథిలావస్థ దశలో ఉండటంతో మండలంలోని ప్రజాప్రతినిధులు దేవాదాయ శాఖ దృష్టికి తీసుకువెళ్ళామన్నారు. ప్రభుత్వం ఆలయ ప్రాముఖ్యతను గుర్తించి ఆలయ పునర్నిర్మాణం చేపట్టడానికి సుమారు మూడు కోట్లకు పైగా నిధులు వెచ్చించటానికి ప్రాథమిక నమూనాను సిద్ధం చేసిందని తెలిపారు. ఆలయం తరపున కమిటీ సభ్యులు రూ.60 లక్షల రూపాయలను ప్రభుత్వం వద్ద సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉందని అన్నారు. ఈ క్రమంలో ఆలయ అభివృద్ధిని ఆకాంక్షించి తన వంతు సాయంగా రూ.25వేలు విరాళంగా అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో దాతలు బి.హేమంత్ కుమార్, విజయ్ కుమార్ రెడ్డి, నాగరాజ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో 'మిట్స్' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-కురబలకోట



ప్రతిభ చూపిన విద్యార్థి లాస్య

స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ చివరి సంవత్సరం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ చదువుతున్న లాస్య ప్రతిష్టాత్మకమైన కేంద్ర ప్రభుత్వ సంస్థ డిఆర్‌డిఒ బెంగళూరులో ఇంటెర్న్‌షిప్‌లో పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువ రాజ్ అన్నారు. లాస్య పైథాన్‌బేస్డ్ సాఫ్ట్‌వేర్ డెవలప్మెంట్ పై ఆరు వారాల పాటు డిఆర్‌డిఒ బెంగళూరు లో సైంటిస్ట్ -ఎఫ్ గజేంద్ర నాండ్ ఖన్నా ఆద్వర్యంలో ఇంటెర్న్‌షిప్ చేసినట్లు ఆయన అన్నారు. విద్యార్థికి ప్రశంస పత్రమును అందజేసినట్లు, కేంద్ర ప్రభుత్వ సంస్థ డిఆర్‌డిఒలో ఇంటెర్న్‌షిప్ రావడం ఎంతో గర్వ కారణమన్నారు. ఈ విద్యార్థిని కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, విభాగాధిపతి డాక్టర్ రాజశేఖరన్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

నేడు పుల్లంపేట మండల సమావేశం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ప్రకాశం ఒక ప్రకటనలో తెలిపారు. మండల సమావేశం మండల పరిషత్ సభా భవనంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని అభివృద్ధి నివేదికలను సమావేశానికి తీసుకురావాలని సూచించారు. సర్పంచులు ఎంపిటిసిలు, కో-ఆప్షన్ సభ్యులు ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను తీసుకురావాలని తెలిపారు.



ఉపాధి హామీ పనులను పర్యవేక్షిస్తున్న ఎపిడి ప్రతాప్

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కొత్తలూరు గ్రామపంచాయతీ నందు గురువారం నాడు ఎపిడి ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఉపాధి సిబ్బందికి ఎపిడి కూలీల సంఖ్య పెంచాలని తెలిపారు. కూలీలకు కేటాయించిన పనిని సకాలంలో పూర్తిచేస్తే రోజు కూలీ రూ.250 ఇస్తారని చెప్పారు. ఉపాధి హామీలో అవకతవకలు జరిగితే సహించబోని సిబ్బందికి తెలిపారు. వేసవి కాలం కాబట్టి కూలీలకు నీటి సమస్య రాకుండా చూసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్, మండల ఉపాధి హామీ సిబ్బందికి ఎపిడి సూచించారు. ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కూలీలకు తాగునీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు.

దబ్బలగుట్టపల్లిలో గంగమ్మ జాతర

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని పరస్తోపు పంచాయతీ దబ్బలగుట్టపల్లెలో వెలసిన గ్రామ దేవత ధూమ్ గంగమ్మ జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూజలు అభిషేకాలు నిర్వహించి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామ మహిళలు దీను, బాణాలు ఊరే పిలుపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. ప్రతి ఏడాది ఇలా అమ్మవారికి జాతర నిర్వహించడం వల్ల గ్రామం సుభిక్షంగా పాడిపంటలతో ప్రజలు ఆరోగ్యం గా ఉంటారని పూర్వీకుల నుంచి వారి నమ్మకం.

ఎస్‌డిజి సర్వే త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో చేపట్టిన ఎస్‌డిజి సర్వే త్వరగా పూర్తి చేయాలని ఎంపిడిఒ ఆనంద్‌కుమార్ కోరారు. ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌డిజి సర్వే లక్ష్యా అనుకున్న లక్ష్యాల మేరకు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అందరూ సమన్వయంతో పనిచేసినప్పుడే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందే విధంగా చూడాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. ప్రజా వినతుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎక్కడైనా విమర్శలు వస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రైం కార్నర్

నాటుసారా నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటు సారాను విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరపరిచినట్లు స్థానిక ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు... వెంగంవారిపల్లి పంచాయతీ సింగరయ్యగారిపల్లికి చెందిన వెంకటరమణ నాటుసారాను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు గురువారం పోలీసులు నిఘా ఉంచినట్లు తెలిపారు. సింగరయ్యగారిపల్లి సమీపంలోని చింత చెట్టు వద్ద నాటు సారాను విక్రయిస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించి అతనిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 8 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడుపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా నాటు సారా తయారీ చేసినా, రవాణా చేసినా విక్రయించిన కేసులు నమోదు చేసి, జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు.